ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
అనంతపురం
జిల్లా వార్తలు
ఆదివారం 10 మార్చి 2024





నేటి నుంచి శంఖారావం

ఐదు నియోజకవర్గాల్లో సభలు

శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న నారా లోకేశ్

అనంతపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనను ఎండగట్టడం, త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు శ్రేణులను సమాయత్తం చేయడమే లక్ష్యంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జిల్లాలో మలి విడత శంఖారావాన్ని పూరించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే శ్రీసత్యసాయి జిల్లాలోని హిందూపురం, మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో ఆయన శంఖారావం సభలను నిర్వహించారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అవినీతి, అక్రమాలు, అరాచకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరించారు. తన పర్యటనతో పార్టీ కేడర్‌లో జోష్ నింపారు. జిల్లాలోని ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో ఆదివారం శంఖారావం సభలను నిర్వహించనున్నారు. ఉరవకొండ నియోజకవర్గ కేంద్రంలో ఉదయం 10 గంటలకు, రాయదుర్గంలో మధ్యాహ్నం, కళ్యాణదుర్గంలో సాయంత్రం సభలను నిర్వహిస్తారు. మరుసటి రోజు 11వ తేదీ సోమవారం అనంతపురం, తాడిపత్రి నియోజకవర్గ కేంద్రాల్లో సభలను నిర్వహిస్తారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, దౌర్జన్యాలను ప్రజలకు వివరిస్తారు. సార్వత్రిక ఎన్నికలను ఏ విధంగా ఎదుర్కొనాలన్న అంశంపైనా పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేస్తారు. మన టీడీపీ, బాబుష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాల అమలులో మెరుగైన పని తీరు కనబరిచిన కార్యకర్తలతో లోకేశ్ భేటీ అవుతారు. వారికి ప్రశంసా పత్రాలను అందజేస్తారు. శంఖారావం సభ నిర్వహణ ఏర్పాట్లను ఆయా నియోజకవర్గాల నాయకులు పర్యవేక్షిస్తున్నారు. పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, జనం హాజరయ్యేలా ముఖ్యనేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

యువగళం స్ఫూర్తితో..

వైసీపీ ప్రభుత్వ విధ్వంసకర పాలనలో బాధితులుగా మారిన ప్రజలకు సాంత్వన చేకూర్చి, ప్రజల్లో చైతన్యం నింపడమే లక్ష్యంగా నారా లోకేశ్ యువగళం పాద యాత్ర నిర్వహించారు. జిల్లాలో పార్టీ శ్రేణుల నుంచి, ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. యువగళం పాదయాత్ర పార్టీ కేడర్‌లో ఎక్కడ లేని ఉత్తేజాన్ని నింపింది. అదే స్ఫూర్తితో శంఖారావం కార్యక్రమాన్ని నారా లోకేశ్ చేపట్టారు.



గజవాహనంపై బుగ్గరామలింగేశ్వరుడు

తాడిపత్రి పట్టణంలోని ప్రముఖ శైవక్షేత్రమైన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు గజవాహనంపై విహరించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మంగళవాయిద్యాల నడుమ పట్టణ వీధుల్లో ఊరేగించారు.

- తాడిపత్రిటౌన్

గజ వాహనంపై కొలువుదీరిన స్వామివారు

ఉష్ణోగ్రతలు 9-3-2024
గరిష్ఠం : 38.51
కనిష్ఠం : 27.0

వృత్తిదారుల నిరీక్షణ

- రాష్ట్రస్థాయికి 335 దరఖాస్తులు మాత్రమే సిఫార్సు
- రెండు బ్యాచ్‌ల్లో 69 మంది క్షురకులకు శిక్షణతో సరి
- మిగిలిన వృత్తులవారి దరఖాస్తులు ఎక్కడికక్కడే..
- జిల్లాకు ఈ ఏడాది టార్గెట్ ఇవ్వని ప్రభుత్వం

విశ్వకర్మ పథకానికి 95,417 దరఖాస్తులు

అర్హతలివే...

విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకునే వారు 18 సంవత్సరాలు నిండిన వారై ఉండాలి. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారుంటే అర్హులు కాదు. ముద్రా రుణాలు పొంది, పూర్తిగా చెల్లించిన వారు అర్హులు. ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే లబ్ధి చేకూరుస్తారు.



క్షురకులకు శిక్షణ (ఫైల్)

అనంతపురం అర్బన్: చేతివృత్తుల వారిలో నైపుణ్యాన్ని పెంచి, వారికి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం జిల్లాలో అతీగతీ లేకుండా పోయింది. గత ఏడాది సెప్టెంబరు 17న విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం కాల పరిమితి ఐదేళ్లు. మొదలై ఐదు మాసాలు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో అమలులోకి రాలేదు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 95,417 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో రాష్ట్రస్థాయికి 335 దరఖాస్తులను మాత్రమే సిఫార్సు చేసి సరిపెట్టారు. మిగిలిన దరఖాస్తులు గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో వివిధ దశల్లో ఉండిపోయాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ఐదు మాసాలు దాటిందని, తమకు ఎప్పుడు శిక్షణ ఇస్తారన్న సమాచారం కూడా ఇవ్వలేదని బాధిత వర్గాలు వాపోతున్నాయి. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పడానికే అధికారులు పరిమితమయ్యారని దరఖాస్తుదారులు నిట్టూరుస్తున్నారు. ఈ పథకానికి ఈ ఏడాది టార్గెట్‌ను ఇప్పటి దాకా ప్రభుత్వం ఇవ్వకపోవడం గమనార్హం. ఈ ఏడాది జిల్లాలో ఎంత మందికి శిక్షణ ఇస్తారు..? ఎంత మందికి బ్యాంకు రుణాలు అందజేయాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం ఇప్పటి దాకా ఇవ్వలేదు. దీంతో అధికారులకు ఏం చేయాలో తోచడం లేదు.

95,417 దరఖాస్తులు

జిల్లా వ్యాప్తంగా 95,417 మంది విశ్వకర్మ పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 78,226 మంది టైలర్లు, 4,876 మంది బేల్దారి, 4,815 మంది చాకలి, 1,701 మంది బార్బర్, 1,229 మంది కార్పెంటర్లు, 1,208 మంది చర్మకారులు, 3,362 మంది ఇతర కులవృత్తులవారు ఉన్నారు.



జనశిక్షణా సంస్థాన్ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న క్షురకులు

18 రకాల వృత్తులకు..

విశ్వకర్మ యోజన ద్వారా 18 రకాల చేతి వృత్తుల వారికి శిక్షణ ఇచ్చి, బ్యాంకు రుణాలను ఇప్పించాలని నిర్ణయించారు. కార్పెంటర్, పడవల తయారీ, పనిముట్ల తయారీ, బ్లాక్ స్మిత్ (కమ్మరి), సుత్తులు, టూల్ కిట్ తయారీ, తాళాల తయారీ, గోల్డ్ స్మిత్ (కంసాలి), కుండల తయారీ, శిల్పులు (రాళ్ల చెక్కేవారు), రాళ్ల కొట్టేవారు, చర్మకారులు, మేస్త్రీలు, బుట్టలు, చాపలు, చీపుర్ల తయారీ, పీచు అల్లేవారు, బొమ్మలు, ఆట వస్తువుల తయారీదారులు, క్షురకులు, పూలు అల్లేవారు, రజకులు, దర్జీలు, చేపల వలలు తయారీ దారులు ఈ పథకానికి అర్హులు. వీరికి ఐదు రోజుల నుంచి పక్షం రోజుల దాకా శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.500 ఉపకార వేతనం చెల్లిస్తారు. ఆ తర్వాత రూ.15 వేల విలువైన టూల్ కిట్‌ను ఇంటికే పంపుతారు. అనంతరం బ్యాంక్ ద్వారా ఎలాంటి ష్యూరిటీ లేకుండా రూ.లక్ష రుణాన్ని అందజేస్తారు. ఈ రుణాన్ని 18 నెలల్లో తిరిగి చెల్లించాలి. ఇలా సక్రమంగా రుణాన్ని తిరిగి చెల్లించిన వారికి రెండో విడత రూ.2 లక్షలు రుణం ఇస్తారు. ఈ రుణాన్ని 30 నెలల్లో చెల్లించాలి. బ్యాంకులో రుణం తీసుకున్న చేతివృత్తుల వారికి 5 శాతం వడ్డీని వర్తింపజేస్తారు. ఇలా వృత్తి అభివృద్ధి ఆధారంగా రుణాలు ఇస్తారు. సకాలంలో చెల్లిస్తే మళ్లీ పెద్ద మొత్తంలో రుణాలు అందజేయాలని నిర్ణయించారు.

335 దరఖాస్తులకే సిఫార్సు

విశ్వకర్మ పోర్టల్ నుంచి ఇప్పటి దాకా 54,794 దరఖాస్తులను గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలకు పంపారు. వీటిలో జిల్లాస్థాయికి 3,604 దరఖాస్తులు సిఫార్సు చేశారు. ఇక్కడి నుంచి 355 దరఖాస్తులను మాత్రమే రాష్ట్రస్థాయి అధికారులకు సిఫార్సు చేశారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ స్థాయిలో 40,472 దరఖాస్తులు, జిల్లా స్థాయిలో 51,042 దరఖాస్తులు, రాష్ట్ర స్థాయిలో 3,228 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

69 మందికి మాత్రమే శిక్షణ

విశ్వకర్మ పథకానికి ఎంపికైన వృత్తుల వారికి శిక్షణనిచ్చే బాధ్యతను జనశిక్షణ సంస్థాన్‌కు అప్పగించారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో రెండు బ్యాచ్‌ల్లో 69 మంది క్షురకులకు (బార్బర్లు) శిక్షణ ఇవ్వడంతో సరిపెట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మొదటి బ్యాచ్‌లో 44 మందికి వారం రోజులపాటు శిక్షణ ఇచ్చారు. రెండో బ్యాచ్ కింద మరో 25 మందికి శిక్షణ పూర్తి చేశారు.



జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయం

తప్పని నిరీక్షణ

విశ్వకర్మ పథకం ద్వారా చేతివృత్తిదారులలో సంప్రదాయ హస్త కళా నైపుణ్యాన్ని పెంపొందించి, ఆర్థిక చేయూత అందిస్తామని ప్రధాన మంత్రి మోదీ ప్రకటించారు. దీంతో వృత్తిదారులు తమ బతుకులకు బాగుపడతాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నైపుణ్య శిక్షణతోపాటు తక్కువ వడ్డీకి బ్యాంకు రుణం పొందవచ్చని గంపెడాశతో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఐదు మాసాలు గడిచినా అర్హుల జాబితాను ప్రభుత్వం తయారు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్ ఇస్తారు. ఆ సర్టిఫికెట్ ఆధారంగానే బ్యాంకులో రుణం మంజూరు చేస్తారు. ఇప్పటి దాకా రెండు బ్యాచ్‌ల్లో 69 మంది క్షురకులకు మాత్రమే శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేశారు. వారికి కూడా బ్యాంకర్లు ఎప్పటిలోగా రుణం అందిస్తారన్న సమాచారం లేదు.

టార్గెట్ ఇవ్వలేదు..



జిల్లా వ్యాప్తంగా 95,417 మంది విశ్వకర్మ పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సంబంధిత అధికారుల లాగిన్‌లకు పంపారు. ఈ ఏడాది విశ్వకర్మ పథకానికి సంబంధించి టార్గెట్ రాలేదు. అయినా రెండు బ్యాచ్‌ల్లో 69 మంది క్షురకులకు జనశిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చాము. దరఖాస్తులు గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో పలు దశల్లో ఉన్నాయి. రాష్ట్ర స్థాయిలో అర్హులుగా నిర్ధారణ చేసిన తర్వాత శిక్షణ కోసం సమాచారం వస్తుంది.

- నాగరాజారావు, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి

కాస్మెటిక్ చార్జీలు ఏవీ?

ఆరునెలలుగా అందని బిల్లులు

- మార్కెట్‌లో కొంటున్న విద్యార్థులు
- తల్లిదండ్రులకు తప్పని ఆర్థిక భారం
- ఉద్యమిస్తామంటున్న విద్యార్థి సంఘాలు

బీసీ సంక్షేమశాఖ కార్యాలయం



అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 9: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు చెల్లించడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. గత ఏడాది సెప్టెంబరు నుంచి కాస్మెటిక్ చార్జీలను పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలోనే విద్యార్థులు ఇంటి నుంచి తమకు కావాల్సిన కొబ్బరినూనె, పౌడర్ తదితర వస్తువులను సొంత డబ్బు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు.

రూ.1.40 కోట్లకుపైగా..

జిల్లాలో అన్ని సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు సంబంధించి ఆరు నెలలకు దాదాపు రూ. 1.40 కోట్లకుపైగానే పెండింగ్ ఉన్నట్లు సమాచారం. జిల్లాలో ఎస్సీ వెల్ఫేర్ పరిధిలో ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు 51 ఉండగా.. అందులో 5040 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరందరికీ కలిపి రూ. 48 లక్షలకు పైగా కాస్మెటిక్ చార్జీలు చెల్లించాల్సి ఉంది. బీసీ వెల్ఫేర్‌లో ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు 55 ఉండగా... అందులో 7459 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి రూ. 84 లక్షలకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గిరిజన సంక్షేమశాఖకు సంబంధించి ఐదు హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, మైనార్టీ సంక్షేమశాఖ పరిధిలోని హాస్టళ్లలో 800 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరికి రూ. 9 లక్షకుపైగానే కాస్మెటిక్ చార్జీలు ఇవ్వాల్సి ఉంది.

టోకెన్ నంబర్లు బంద్...

సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు అందించాల్సిన కాస్మెటిక్ చార్జీలకు సంబంధించిన బిల్లులు వార్డెన్ల నుంచి ఆయా సంక్షేమశాఖల పర్యవేక్షణాధికారుల ద్వారా ట్రెజరీకి పంపాల్సి ఉంటుంది. ఆ బిల్లులను అప్‌లోడ్ చేసేందుకు డివిజన్ల వారీగా టోకెన్ నెంబర్లను ఇస్తారు. ఆ టోకెన్ల నెంబర్ల ద్వారానే సీఎఫ్‌ఎంఎస్ ద్వారా బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ టోకన్ల నెంబర్ల జారీలో కాలయాపన చేస్తుండటం బిల్లుల ఆలస్యానికి కారణ మని సంక్షేమశాఖల అధికారులే పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద బడ్జెట్ లేకపోవడం, ఉన్న బడ్జెట్‌ను సంక్షేమ పథకాలకు మళ్లించడంతోనే టోకెన్ నెంబర్లను బంద్ చేసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



ఎస్సీ,ఎస్టీ సంక్షేమశాఖల కార్యాలయాల సముదాయం

నెలవారీగా విద్యార్థులకందించాల్సిన కాస్మెటిక్ చార్జీలు ఇలా....

తరగతి	బాలురు	బాలికలు
3,4,5,6వ తరగతులు	రూ. 125	రూ. 130
7,8,9,10వ తరగతులు	రూ. 150	రూ. 200
ఇంటర్మీడియట్ ఆపై...	రూ. 200	రూ. 250

మేనమామ అంటూ అన్యాయం చేస్తున్నాడు



సీఎం జగన్మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు మేనమామ అంటూనే వారికందాల్సిన సౌకర్యాలు కల్పించకుండా మోసం చేస్తున్నాడు. ఎన్నికల సమయంలో సంక్షేమ పథకాలకు బటన్ నొక్కుతున్న జగన్... ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు అందించే డైట్, కాస్మెటిక్ బిల్లుల విషయంలో నిర్లక్ష్యం వహించడం దారుణం. ఎన్నికలు వచ్చేలోపు పెండింగ్‌లో ఉన్న డైట్, కాస్మెటిక్ బిల్లులను విడుదల చేయాలి. ఇప్పటికే ఈ అంశంపై దశల వారీగా పోరాటం చేస్తున్నాం. రాబోయే రోజుల్లో ఉద్యమాలను ఉధృతం చేస్తాం.

- కుళ్లాయిస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఐఎస్‌ఎఫ్

వెంటనే విడుదల చేయాలి



సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కాస్మెటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలి. జిల్లాలో కరువు నెలకొన్న తరుణంలో కొబ్బరినూనె, పౌడర్ తదితర వస్తువులను కొనడానికి పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న కాస్మెటిక్ చార్జీలను వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలి. లేదంటే విద్యార్థుల పక్షాన అఖిలభారత విద్యార్థి బ్లాక్ ఆధ్వర్యంలో ఉద్యమాలకు శ్రీకారం చుడతాం.

- పాపిరెడ్డిపల్లి పృథ్వి, జిల్లా ప్రధానకార్యదర్శి, అఖిలభారత విద్యార్థి బ్లాక్

మార్కెట్ కమిటీల ఫీజు వసూళ్లకు ఈనెల ఆఖరికే గడువు

- ఇప్పటికే లక్ష్యాన్ని పూర్తి చేసిన శింగనమల
- చివరి స్థానంలో గుత్తి



అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు, మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయం



టార్గెట్ పూర్తయ్యేనా..?

అనంతపురంరూరల్, మార్చి 9: మార్కెట్ కమిటీల ఫీజు వసూళ్ల గడువు ఈ నెలాఖరితో ముగుస్తుండటంతో టార్గెట్ పూర్తయ్యేనా అన్న సందేహాలు ఆయా వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతానికి వసూళ్లు ఆశాజనకంగా ఉన్నప్పటికీ.. ఈనెలతో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో పూర్తి స్థాయిలో లక్ష్యాలు సాధించగలమా.. అని ఆయా మార్కెట్ కమిటీల సభ్యులు అయోమయంలో పడ్డారు. ఇప్పటికే శింగనమల మార్కెట్ కమిటీ లక్ష్యాన్ని మించి వసూళ్లు సాధించి జిల్లాలో మొదటి స్థానంలో ఉండగా.. రెండో స్థానానికి కొద్దిపాటి వ్యత్యాసంతో తాడిపత్రి, అనంతపురం పోటీ పడుతున్నాయి. మిగిలిన కమిటీల పరిస్థితి మెరుగానే ఉన్నా.. గుత్తి మార్కెట్ కమిటీ మాత్రం 50 శాతం కూడా పూర్తి కాక.. లక్ష్యసాధనలో ఆఖరిలో ఉంది.

టార్గెట్ రూ.10.81 కోట్లు

జిల్లా మార్కెటింగ్ శాఖకు ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.10.81 కోట్లు లక్ష్యాన్ని మార్కెటింగ్ శాఖ కమిషనర్ నిర్దేశించారు. ఈక్రమంలో జిల్లాలో ఉన్న తొమ్మిది మార్కెట్ కమిటీలకు ఆదాయం రాబడి, ఖర్చులు, ఇతరత్రా వాటిని పరిగణలోకి ఉంచుకుని ఆ మేరకు లక్ష్యాలను జిల్లా అధికారులు కేటాయించారు. ఇందులో ఫిబ్రవరి ఆఖరికే శింగనమల మార్కెట్ కమిటీ తమ లక్ష్యాన్ని పూర్తి చేయడం కొసమెరుపు. కమిటీ లక్ష్యం రూ.75 లక్షలు కాగా.. రూ.88.44 లక్షలు సాధించింది. అదేవిధంగా తాడిప్రతి మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.1.85 కోట్లు కాగా..1.75 కోట్లు సాధించి రెండవ స్థానంలో ఉంది. అలాగే అనంతపురం మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.4.10 కోట్లు కాగా రూ.3.88 కోట్లు సాధించింది. ఆ తరువాత రాయదుర్గం మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.1.20 లక్షలు కాగా..1.05 కోట్లు సాధించగా.. గుత్తి మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.28 లక్షలు కాగా..రూ.13.60 లక్షలు సాధించి చివరి స్థానంలో ఉంది.

మార్కెట్ కమిటీ..లక్ష్యాలు..సాధన వివరాలు

మార్కెట్ కమిటీ	లక్ష్యం రూ.	ఫిబ్రవరి ఆఖరికి రూ.	సాధించిన శాతం
అనంతపురం	4.10కోట్లు	3.88కోట్లు	94.76
గుత్తి	28లక్షలు	13.60లక్షలు	48.57
గుంతకల్లు	85లక్షలు	49.23లక్షలు	57.92
కళ్యాణదుర్గం	52లక్షలు	43.19లక్షలు	83.06
రాప్తాడు	50లక్షలు	41.59లక్షలు	83.18
రాయదుర్గం	1.20కోట్లు	1.05కోట్లు	87.51
శింగనమల	75లక్షలు	88.44లక్షలు	117.92
తాడిపత్రి	1.85కోట్లు	1.75కోట్లు	94.89
ఉరవకొండ	76లక్షలు	62.19లక్షలు	81.83

టార్గెట్ పూర్తి చేసేందుకు కృషి ..

టార్గెట్లు పూర్తి చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకున్నాం. ఆ మేరకు మార్కెట్ కమిటీలకు సూచనలిచ్చాం. ప్రస్తుతానికి మార్కెట్ ఫీజు వసూళ్లు బాగానే ఉన్నా.. రాష్ట్రంలో కర్నూలు మినహాయిస్తే.. ఏ జిల్లాలోను ఫీజు వసూళ్లు పెద్దగా లేవు. వర్షాలు లేకపోవడం కారణంగా.. పంటలు లేకుండా పోయాయి. ఈ క్రమంలో లక్ష్యాల సాధనకు కొంత ఇబ్బందులు వస్తున్నాయి. అయినప్పటికీ లక్ష్యాలను పూర్తి చేసేందుకు కృషి చేస్తాం. గత ఏడాది లక్ష్యాన్ని అధికమించాం. రూ.10.34 కోట్లకు గాను.. రూ.10.74 కోట్లు సాధించాం.

- సత్యనారాయణ చౌదరి, ఏడీ మార్కెటింగ్ శాఖ, అనంతపురం జిల్లా

ఎక్కుదాం పద.. సైకిల్..!



- తాడిపత్రి వైసీపీలో అసమ్మతి సెగలు
- టీడీపీలో చేరాలని నాయకుల నిర్ణయం
- చేరికలకు వేదికగా శంఖారావం సభ..?

తాడిపత్రిటౌన్, మార్చి 9: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తాడిపత్రి రాజకీయం వేడెక్కుతోంది. నియోజకవర్గంలో అన్ని మండలాల్లో వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు పలువురు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. వారిలో పలువురు టీడీపీ వైపు చూస్తున్నారన్న చర్చ నడుస్తోంది. తాడిపత్రిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈ నెల 11వ తేదీ సోమవారం శంఖారావం సభలో పాల్గొంటున్నారు. ఈ వేదికపై తాడిపత్రికి చెందిన కొంతమంది వైసీపీ అసమ్మతి నాయకులు టీడీపీలో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాడిపత్రికి చెందిన మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్, 2019 ఎన్నికల్లో కీలకపాత్ర పోషించిన మరో నాయకుడు టీడీపీ తీర్థం పుచ్చుకుంటారని తెలిసింది. 2014 ఎన్నికల్లో వైసీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీచేసిన అభ్యర్థి కుటుంబ సభ్యులు ప్రస్తుతం నంద్యాల జిల్లా బనగానపల్లిలో టీడీపీ తరఫున ప్రచారంలో పాల్గొంటున్నారు. ఆ కుటుంబానికి చెందిన అభ్యర్థితోపాటు తాడిపత్రిలో ఉన్న వైసీపీ నాయకుడు కూడా టీడీపీలో చేరుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.

యాడికిలో ఎదురుదెబ్బ

వైసీపీ యాడికి మండల నాయకుడు ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి సిద్ధమైనట్లు వైసీపీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. వైసీపీకి చెందిన ఉప సర్పంచు టీడీపీకి అంతర్గతంగా మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు సమాచారం. ఎమ్మెల్యే కార్యక్రమాలకు తనను ఇకపై ఆహ్వానించవద్దని వైసీపీ నాయకులకు ఉప సర్పంచ్ చెప్పినట్లు తెలుస్తోంది. తాజా పరిణామాలను చూస్తే, యాడికి మండలంలో వైసీపీకి పెద్ద ఎదురుదెబ్బ తప్పేలా లేదని మండలవాసులు చర్చించుకుంటున్నారు.

కీలక నాయకులు టీడీపీ వైపు

పెద్దపప్పూరు మండలంలోని ఒక ముఖ్య వైసీపీ నాయకుడు టీడీపీకి మద్దతు పలికేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మండలంలోని మరికొంతమంది ద్వితీయశ్రేణి నాయకులు కూడా వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనడంలేదు. వీరంతా కూడా టీడీపీకి మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ గెలుపులో కీలకంగా ఉన్న పెద్దవడుగూరు మండలంలోనూ ఈ సారి వైసీపీకి ఎదురీత తప్పేలా లేదు. వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. వీరు అంతర్గతంగా టీడీపీకి మద్దతు తెలిపే అవకాశం ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు.


అమిలినేని సురేంద్రబాబును సన్మానిస్తున్న మైనార్టీలు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

ప్రజల మద్దతుతో విజయం సాధిస్తాం

కళ్యాణదుర్గం మార్చి 9: ప్రజల మద్దతుతో నియోజకవర్గంలో టీడీపీ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. శనివారం ప్రజావేదిక వద్ద ఐదు మండలాల కన్వీనర్లు కలిసి వచ్చి టీడీపీ విజయానికి శాయశక్తులా కృషి చేస్తామని ప్రకటిం చారు. పట్టణంలో ఉన్న మైనార్టీల ఇళ్ల వద్దకు వెళ్లి టీడీపీ విజయానికి కృషి చేయాలని అమిలినేని సురేంద్రబాబు కోరారు. ఈ సందర్భంగా వారంతా పూల మాలలు, శాలువాలతో ఆయన్ను సన్మానించారు. అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో పేదల జీవితాల్లో గొప్ప మార్పు వస్తుందన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి టీడీపీ మేనిఫెస్టోలో చోటు కల్పించారన్నారు. అమిలినేని యశ్వంత్ మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తును బాగు చేయడం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలన్నా, కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామ్మోహన్ చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ, మల్లికార్జున, శర్మాస్ వలి, మండల కన్వీనర్లు శివన్న, శ్రీరాములు, గోళ్ల వెంకటేశ్వర్లు, ధనుంజయ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



ప్రజావేదిక నుంచి మాట్లాడుతున్న అమిలినేని సురేంద్రబాబు తనయుడు అమిలినేని యశ్వంత్

వైభవంగా సిద్ధేశ్వరస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ, మార్చి 9: మండలంలోని పెద్దముష్టూరు గ్రామంలో సిద్ధేశ్వర స్వామి రథోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలను చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని రథంపై ఉంచి, ఆలయం చుట్టూ రథాన్ని లాగారు. రథంపైకి భక్తులు అరటిపండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా జరుట్ల రామలింగేశ్వస్వామి రథోత్సవం


జరుట్ల రాంపురంలో ఉత్సమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

వజ్రకరూరు మండలంలోని జరుట్ల రాంపురంలో శివరాత్రి ఉత్సవాలలో భాగంగా జరుట్ల రామలింగేశ్వస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని రథంపై అధిష్టింప జేశారు. ఆలయం నుంచి బసవన్న గుడి వరకూ రథాన్ని లాగి, తిరిగి రథాన్ని యథాస్థానానికి చేర్చారు.

రుద్రంపల్లిలో..


అశేష జనసందోహం నడుమ రథాన్ని లాగుతున్న భక్తులు

కుందుర్పి, మార్చి 9: మండలంలోని రుద్రంపల్లి గ్రామంలో వెలసిన పరమశివుడి రథోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు ఈశ్వర స్వామి రథోత్సవం నిర్వహించారు. భక్తులంతా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.


ప్రత్యేకాలంకరణలో పరమేశ్వరుడు

ఘనంగా అజ్జయ్యతాత రథోత్సవం


గోనబావిలో అజ్జయ్యతాత రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

గుమ్మఘట్ట, మార్చి 9: మండలంలోని గోనబావి గ్రామంలో మహాశివరాత్రి వేడుకల సందర్భంగా శనివారం ఉదయం అవదూత అజ్జయ్యతాత రథోత్సవం ఘనంగా జరిగింది. కొండలో వెలసిన స్వామివారి గుడి నుంచి గోనబావి కొత్త కాలనీ వరకు రథాన్ని లాగారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కమనీయం... శివపార్వతుల కల్యాణం

యాడికి, మార్చి9: మహాశివరాత్రి సందర్భంగా శనివారం కోన రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. మధ్యాహ్నం స్వామి వారి రథోత్సవాన్ని నిర్వహించారు. కోనుప్పలపాడు, ఓబులాపురం, కత్తిమానుపల్లి, కమలపాడు, యాడికి, కుందనకోట, నంద్యాల జిల్లా వంకమిట్టపల్లి, కౌలుపల్లి, బూరుగల, తండా తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. యాడికిలోని భైరవలింగేశ్వరస్వామి, భోగలింగేశ్వరస్వామి, నాగలింగేశ్వరస్వామి ఆలయాల్లో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. రాయలచెరువులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, గౌరీశంకర ఆలయాల్లో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.


పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి


కోన రామలింగేశ్వరుని రథోత్సవం

కలిసి పనిచేద్దాం..

టీడీపీ శింగనమల శ్రేణులకు కాలవ పిలుపు.. అసంతుష్ట నేతలతో విడివిడిగా సమావేశం

పార్టీని గెలిపిద్దాం


సమావేశానికి హాజరైన కార్యకర్తలు , మాట్లాడుతున్న జిల్లా టీడీపీ అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు

బుక్కరాయసముద్రం, మార్చి 9: శింగనమల నియోజకవర్గంలో టీడీపీ గెలుపు కోసం సమష్టిగా పనిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు సూచించారు. పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు. అనంతపురం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నియోజకవర్గ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆరు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కాలవ, పార్టీ పరిశీలకుడు గుర్రప్పనాయుడు, పార్టీ అభ్యర్థి బండారు శ్రావణీ శ్రీ, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, ద్విసభ్యకమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, డేగల క్రిష్ణమూర్తి తదితరులతో వేర్వేరుగా భేటీ అయ్యారు. అసంతుష్ట నాయకులతో మాట్లాడి, వచ్చే ఎన్నికల్లో కలిసి పనిచేయాలని సూచించారు. శింగనమలలో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే.. ఆ పార్టీ అధికారంలోకి వస్తుందని, ఈ సెంటిమెంట్‌ను దృష్టిలో ఉంచుకుని పార్టీ అభ్యర్థిని గెలిపించాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసినవారికి తగిన గుర్తింపు ఎప్పుడూ ఉంటుందని అన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకు పోవాలని బండారు శ్రావణికి సూచించారు. చంద్రబాబు సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు.

అందరికీ న్యాయం: శ్రావణి

నియోజకవర్గంలో పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ ఖచ్చింగా న్యాయం చేస్తానని టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి అన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని ఆమె అన్నారు. గతంలో చిన్నచిన్న పొరపాట్లు జరిగి ఉంటే మనుసులో ఉంచుకోవద్దని విజ్ఞప్తి చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ఏ ఒక్కరినీ విస్మరించనని హామీ ఇచ్చారు. 'మీ ఆడబిడ్డగా ఉంటా.. అందరూ కష్టపడి పని చేద్దాం' అని అన్నారు. చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు విశాలాక్షి, అశోక్, శ్రీనివాసులురెడ్డి, మారుతీ నాయుడు, సుదర్శన్ నాయుడు, బాలరంగయ్య, గేట్ క్రిష్టారెడ్డి, పరుశురామ్, దాసరి గంగాధర్, కుళ్లాయప్ప, ఆది, మల్లికార్జునరెడ్డి, లక్ష్మీనారాయణ, ఎస్.నారాయణస్వామి, కేశన్న, సీనారాయణస్వామి, చంద్రశేఖర్‌నాయుడు, విజయ్, శివశంకర్‌రెడ్డి, పుల్లయ్య, అనిల్‌కుమార్ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల దారి మళ్లింపు

గుంతకల్లు, మార్చి9: డోన్ రూటులో జరుగుతున్న ట్రాక్ పనుల కారణంగా మూడు రైళ్లను దారిమళ్లించినట్లు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. హౌరా-సత్యసాయి ప్రశాంతి నిలయం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నెం. 22831) రైలును ఈ నెల 20న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 22832)ను, పూరి-యశ్వంతపూర్ గరీబ్ రథ్ (నెం. 22883) రైలును 22న డోన్, గుత్తి స్టేషన్ల మీదుగా కాకుండా గుత్తి పోర్టు, ఎర్రగుంట్ల, నంద్యాల స్టేషన్ల మీదుగా దారి మళ్లించనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి గుత్తి, డోన్ స్టేషన్లలో దిగాల్సిన ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసుకోవాలని తెలియజేశారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

కొత్తచెరువు, మార్చి 9: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన ప్రథమ సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 307 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐఓ సురేశ్‌బాబు తెలిపారు. జిల్లాలోని 41 కేంద్రాలలో ప్రథమ సంవత్సరం గణితం 1బీ, జంతుశాస్త్రం-1 హిస్టరీ -1 పరీక్షలు జరిగాయన్నారు. 9033 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 307మంది గైర్హాజరు కాగా 8,726 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు ఆర్ఐఓ తెలిపారు.

రేపు లేపాక్షిలో అప్రెంటిస్‌షిప్ మేళా

పుట్టపర్తి, మార్చి 9 : లేపాక్షిలోని ఐటీఐ కళాశాలలో ఈనెల 11న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి రఘునాథ్‌రెడ్డి శనివారం ప్రకటించారు. ఇంటర్మీడియట్‌లో ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసిన వారు అప్రెంటిషిప్‌కు అర్హులని, అవసరమైనవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, బయోడేటా, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలతో ఉదయం 9గంటలకు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి సంప్రదించాలన్నారు. ఎంపికైన వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు స్టైఫండ్ ఇస్తామన్నారు. వివరాలకు ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి 9440258629 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

తగ్గని డెంగీ

అనంత ఆస్పత్రికి మరో ఐదుగురు

పల్లెల్లో అపరిశుభ్రతే జ్వరాలకు కారణం
పంచాయతీల్లో నిధుల కొరతతో సమస్య


శింగనమల కమ్యూనిటీ ఆసుప్రతిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు


సోదనపల్లిలో అపరిశుభ్రత ప్రాంతం

శింగనమల, మార్చి 9: డెంగీ జ్వరం జనాన్ని వణికిస్తోంది శింగనమల మండలంలో పలువురు డెంగీబారిన పడ్డారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మరో ఐదుగురు చిన్నారులను శనివారం అనంతపురం పెద్దాసుపత్రికి రెఫర్ చేశారు. సి.బండమీదపల్లి గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి, ఆమె కుమారులు రోహిత్, మోహిత్ డెంగీ బారిన పడ్డారు. వీరు అనంతపురంలో చికిత్స పొందుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన జహ్నవి, పూజిత, శింగనమల బోయవీధి చెందిన చిన్నారి లక్ష్మి డెంగీతో ఆస్పత్రిలో చేరారు. అనంతపురం పెద్దాసుపత్రిలో శుక్రవారం చేరిన కుందన్ యాదవ్, మంగళ యశ్వంత్, అశ్విత, చరణ్‌కు చికిత్స కొనసాగుతోంది.

పల్లెల్లో అపరిశుభ్రత

శింగనమల మండలంలోని పలు గ్రామాల్లో అపరిశుభ్రత కారణంగా దోమలు ప్రబలాయని, ఇదే డెంగీకి కారణమని అంటున్నారు. మురుగునీటి కాలువలను శుభ్రం చేయడంలేదు. పారిశుధ్య కార్మికులకు సకాలంలో జీతాలు అందడం లేదు. పంచాయతీలో నిధులు లేవు. వెరసి.. గ్రామాలలో పారిశుధ్య పనులు అటకెక్కాయి. ఎక్కడ చూసినా మురుగునీరు, చెత్త దిబ్బలు కనిపిస్తున్నాయి. అపరిశుభ్ర వాతావరణం కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి.

స్పందించిన అధికారులు

శింగనమల మండలంలో డెంగీ విజృంభణ గురించి ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శింగనమల, సి.బండమీదపల్లిలో పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది పర్యటించారు. మురుగునీటి కాలువల్లో క్రిమి సంహారక మందును పిచికారీ చేశారు. ఇంటింటికీ వెళ్లి జ్వరపీడితుల వివరాలు సేకరించారు. మెడికల్ ఆఫీసర్ శంకర్‌నాయక్, ఈఓపీఆర్‌డి మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించారు.

వైరల్ అంటే.. రెఫర్

శింగనమల మండలంలో వైరల్ ఫీవర్‌తో ఏ ఒక్కరు ఆస్పత్రికి వెళ్లినా అనంతపురానికి రెఫర్ చేస్తున్నారు. శింగనమల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.. పేరుకు మాత్రమే 24 గంటల ఆసుపత్రులు. ఇక్కడ రాత్రిళ్ల వైద్యులు అదుబాటులో ఉండటం లేదు. జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించి, పరీక్షిస్తున్నారు. ఆ తరువాత అనంతపురం రెఫర్ చేస్తున్నారు. గత 20 రోజులుగా మండలంలో జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. ఇలాంటి సమయంలోనైనా ఆస్పత్రులలో వైద్యులు అందుబాటులో ఉండాలని ప్రజలు కోరుతున్నారు.


శింగనమలలో ఇంటింటా జ్వరాల సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది


ఆసుప్రతిలో చికిత్స పొందుతున్న అన్నదమ్ములు రోహిత్,మోక్షిత్

సోదనపల్లి గ్రామానికి చెందిన చిన్నారి


ఆర్టీసీ బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

ఆర్టీసీ బస్సులు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

'సిద్ధం' ఎఫెక్ట్

ఉరవకొండలో ఆర్టీసీ బస్సులు లేక ప్రజల ఇక్కట్లు

ఉరవకొండ, మార్చి 9: సిద్ధం ముగింపు సభకు ఆర్టీసీ బస్సులు వెళ్లడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల అధికారపార్టీ సభలు ఎక్కడ జరిగితే అక్కడికి ఆర్టీసీ బస్సులు తరలించడం రివాజుగా మారింది. ప్రయాణికుల గురించి పట్టించుకోకుండా ఆర్టీసీ బస్సులను తరలించారు. ఉరవకొండ డిపో నుంచి 15 బస్సులు బాపట్ల జిల్లాలో జరిగే సిద్ధం సభకు పంపారు. దీంతో ఉరవకొండ బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి బస్సుల కోసం నిరీక్షించారు. చంటి బిడ్డలతోనే మహిళలు, వృద్ధులు పడిగాపులు కాశారు.

శైవభక్తులకు ఇబ్బందులు

పుట్టపర్తి, మార్చి 9 : వైసీపీ సిద్ధం సభకు తరచూ ఆర్టీసీ బస్సులు తరలిస్తుండంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా మేదరమెట్లలో నిర్వహిస్తున్న సిద్ధం సభకు జిల్లా నుంచి వంద ఆర్టీసీ బస్సులు కేటాయించారు. బస్సులు శనివారమే తరలి వెళ్లాయి. శివరాత్రి పండగకు ఇతర రాష్ట్రాల నుంచి సొంత గ్రామాలకు వచ్చిన ఉద్యోగులు, వ్యాపారస్థులు, ఆదివారం తిరిగి వెళ్లడానికి బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రజా రవాణా పేరుతో నిర్వహిస్తున్న బస్సులు పార్టీ కార్యక్రమాలకు వినియోగించడంపై పలువురు విమర్శిస్తున్నారు. అసలే కొత్త జిల్లా బస్సుల కొరత, పలు ప్రాంతాలకు బస్సు సర్వీసులు లేక ఇబ్బందులు పడుతున్నా అధికార పార్టీ వారి ఇబ్బందులు పట్టించుకోరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కార్యక్రమాలకు బస్సులు పంపడంపై ఇదెక్కడి చోద్యం అంటూ ప్రశ్నిస్తున్నారు.

ఎస్‌బీఐ ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే ప్రకటించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, మార్చి 9: ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, గత నాలుగేళ్లలో అమ్మిన బాండ్లు, వాటిని కొన్నవారి సమాచారాన్ని ఎన్నికల సంఘానికి 13వ తేదీలోపు బహిర్గత పరచాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో ఎస్‌బీఐ విఫలమైందని విమర్శించారు. ఈ సమాచారాన్ని ఇవ్వడానికి సుప్రీంకోర్టు ఎస్‌బీఐకి మూడు వారాల గడువు ఇచ్చిందన్నారు. గడువు ముగిసేవరకు మౌనంగా ఉన్న ఎస్‌బీఐ మరో 116 రోజులు అదనపు గడువు కావాలని కోర్టును ఆశ్రయించడం కోర్టు ధిక్కారమేనన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను భ్రష్టు పట్టించిన ఎన్నికల బాండ్ల విధానం వల్ల బీజేపీ అత్యధికంగా లాభపడిందని తెలిపారు. రానున్న ఎన్నికలు ముగిసేవరకు ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించకుండా ఎస్‌బీఐ ద్వారా పన్నాగం పన్నినట్లు స్పష్టమవుతోందన్నారు. తన కార్యకలాపాలన్నింటినీ డిజిటలైజ్ చేసిన ఎస్‌బీఐ ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను కోర్టు చెప్పిన మూడు వారాల్లో ఇవ్వలేకపోయిందంటే నమ్మశక్యంగా లేదన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఒత్తిళ్ల కారణంగానే ఎస్‌బీఐ సహించరాని ఈ వైఖరి తీసుకుందని విమర్శించారు. ఇప్పటికైనా ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలన్నీ ఎస్‌బీఐ అందించేలా సుప్రీంకోర్టు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌బీఐ వైఖరిని నిరసిస్తూ సోమవారం ఆశాఖ బ్రాంచిల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాల్లో అన్నివర్గాలవారు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఏపీఎల్‌లో అనంత, తాడిపత్రి జట్ల విజయం


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న భార్గవ్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 9: ఏపీఎల్‌లో అనంత రైజింగ్ స్టార్స్ తాడిపత్రి లెవెన్ జట్లు విజయం సాధించాయి. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో 15వ విడత సీనియర్ ఏపీఎల్ టీ20 క్రికెట్ పోటీలు నిర్వహించారు. అనంత రైజింగ్ స్టార్, హిందూపురం యునైటెడ్ క్రికెట్ క్లబ్ జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన అనంత రైజింగ్ స్టార్ 19.5 ఓవర్లలో 115 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన హిందూపురం 11.2 ఓవర్లలో 58 పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో అనంత 57 పరుగుల తేడాతో విజయం సాధించింది. భార్గవ్ మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు దక్కింది.


కార్తీక్‌కు అవార్డు అందజేస్తున్న దృశ్యం

మరో మ్యాచ్‌లో తపోవనం క్రికెట్ అకాడమీ, తాడిపత్రి జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన తపోవనం జట్టు నిర్ణీత 20ఓవర్లలో 146 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన తాడిపత్రి జట్టు 15ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. 3 వికెట్లు తీసిన కార్తీక్ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, సభ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.

ముస్లింలపై దాడి చేసిన పోలీసులను డిస్మిస్ చేయాలి


క్లాక్‌టవర్ వద్ద నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఆవాజ్, ముస్లిం మైనార్టీ నాయకులు

అనంతపురం కల్చరల్, మార్చి 9: ఢిల్లీలో నమాజ్ చేస్తున్న ముస్లింలపై బూట్‌కాలుతో తన్ని దాడికి పాల్పడిన పోలీసులను డిస్మిస్ చేయాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు వలి డిమాండ్ చేశారు. దాడిని నిరసిస్తూ శనివారం సాయంత్రం ఆవాజ్, మైనార్టీ ప్రజాసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ వద్ద నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ఢిల్లీలోని ఇంద్రలోక్ ప్రాంతంలో నమాజ్ చేస్తున్న ముస్లింలను కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పోలీసులు బూటుకాళ్లతో తన్నారన్నారు. ఇంతటి దారుణాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. అనైతిక చర్యలకు పాల్పడిన పోలీసులను తక్షణమే డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమవకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్, మసూద్, ఇర్ఫాన్, జాఫర్, బాబు, ఇస్మాయిల్, ఇమామ్, ఆజం, షౌకత్‌ఖాన్, బాషా జహంగీర్, నూర్‌బాబా, షెక్షా పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం పెరగాలి


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, మార్చి 9: మహిళల్లో చైతన్యం పెరగాలని కృపా కమ్యూనిటీ బేస్‌డ్ ఆర్గనైజేషన్ నిర్వాహకురాలు సునీత పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం అనంత సాగర్ కాలనీలో పేద మహిళలకు నిత్యావసర సరుకులు, గాజులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. సమాజంలో నేటికీ మహిళలు వివక్షతకు గురవుతుండడానికి కారణం విద్యను అభ్యసించకపోవడంవల్లేనన్నారు. చట్టాలపై అవగాహన లేకపోవడం, అపోహల వల్ల అనేక విషయాల్లో వెనుకంజలో ఉన్నారన్నారు. ప్రతిఒక్కరూ విద్యనభ్యసించాలని, తద్వారా సమాజంలో అన్ని రంగాల్లోనూ రాణించగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి, అంజనమ్మ, సరళ, ముకుంద, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

కార్ల రిపేరీ షెడ్‌లో అగ్నిప్రమాదం

అనంతపురం న్యూటౌన్, మార్చి9: జిల్లా కేంద్రంలోని తపోవనం సర్కిల్ వద్ద ఎమ్ఎస్‌టీ కార్ల రిపేరి షెడ్‌లో శనివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఒక పక్క కార్లు రిపేరి చేస్తూ.. మరో పక్క వెల్డింగ్ పనులు చేస్తున్నారు. సమీపంలో పెట్రోల్ క్యాన్ ఉండటంతో మంటలు చెలరేగి అగ్నిప్రమాదానికి దారి తీసినట్లు అగ్నిమాపక శాఖాధికారులు తెలిపారు. అగ్నిప్రమాద సంఘటనలకు సంబంధించి సమాచారం అందిన వెంటనే ఏడీఎఫ్ఓ లింగమయ్య ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. రిపేరి షెడ్ కావడంతో అప్పటికే అక్కడున్న కార్లు దగ్ధం అయిపోయాయి. నిర్వాహకుడు మహబుబ్ బాషాతో అగ్నిమాపక శాఖ సిబ్బంది వివరాలు సేకరించి నష్టాన్ని అంచనా వేసినట్లు ఆయనతెలిపారు. రూ.9.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అంచనా వేశామన్నారు.


మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది...

శంఖారావం సభను విజయవంతం చేయండి

● మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, మార్చి 9: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ చేపట్టిన శంఖారావం సభను జయప్రదం చేద్దామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, నాయకులతో ఆయన సవేశమయ్యారు. 11వ తేదీన రుద్రం పేటలోని పీవీకేకే కళాశాలలో ఉదయం 10 గంటలకు శంఖారావం బహిరంగ సభ ఉంటుందన్నారు. సభకు అనంతపురం అర్బన్ నుంచి పెద్ద సంఖ్యలో నా యకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యేలా ప్రత్యేక చొరవ చూపాలన్నా రు. నాయకులు తలారి ఆదినారాయణ, దేవళ్ల మురళీ, డిష్ నాగరాజు, సరిపూటి రమణ, నటేష్ చౌదరి, మారుతీకుమార్ గౌడ్, పోతుల లక్ష్మీనరసింహులు, బంగి నాగ, పీఎం లక్ష్మీప్రసాద్, మార్కెట్ మహేష్, గుర్రం నాగభూషణం, ముక్తియార్, వన్నూరు, తెలుగు మహిళలు స్వప్న, విజయశ్రీరెడ్డి, సరళ, సంగా తేజస్విని, కంతా దేవి, కృష్ణవేణి, జానకి, హసీనా పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్ చౌదరి

శంఖారావం సభకు ఏర్పాట్లు: నారాలోకేశ్ శంఖారావం సభను జయప్రదం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళీ, నాయకులు మణికంఠబాబు, నాగేంద్ర, లక్ష్మీనరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీన రుద్రంపేటలోని పీవీకేకే కళాశాలలో జరిగే నారాలోకేశ్ శంఖారావం సభకు పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు, ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై చైతన్యం తేవడమే లక్ష్యం



రామగిరి మండలం ముత్యాంపల్లి, కనగానపల్లి మండలం కేఎస్ పాళ్యంలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

రామగిరి, మార్చి 9: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తీసుకువచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. శనివారం మండలంలోని ముత్యాలంపల్లి గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మేనిఫెస్టోలోని పథకాల గురించి వివరించారు వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, మోసాలపై ప్రజలకు వివరిస్తున్నారు. ఎన్నికల్లో టీడీపీ పట్టం కడితే బీసీలకు ప్రత్యేకంగా డిక్లరేషన్ ఇచ్చారని, రాప్తాడు కూడా అబివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. మాజీ జడ్పీటీసీ రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, తెలుగుయువత అధ్యక్షుడు శ్రీధర్‌నాయుడు, యూనిట్ ఇన్‌చార్జి పోతన్న, ఎంపీటీసీ పోతన్న, లింగన్న, కురుబ రాము, షణ్ముఖ పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్: కనగానపల్లి మండలం కేఎస్‌పాళ్యం, శివపురం కొట్టాల గ్రామాల్లో శనివారం టీడీపీ నాయకులు ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి పథకాలను వివరించారు. రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, మండలకన్వీనర్ యాతంపోతులయ్య, పూజారి రాజాకృష్ణ, బిల్లే దామోదర్, సర్పంచ్ సోమర చంద్రశేఖర్, బ్రహ్మానందరెడ్డి, లక్ష్మీరెడ్డి, క్రిష్టప్ప, మంద నాగార్జున, అనిల్‌కుమార్, ఆంజప్ప, లింగమయ్య, సూరి, ఆర్డీటీ నాగార్జున, ఆనంద్, బాబయ్య, వేణు, చంద్ర, లక్ష్మన్న పాల్గొన్నారు.

కనుల పండువగా బ్రహ్మరథోత్సవం


బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్న ఆలయ కార్యవర్గం

అనంతపురం కల్చరల్, మార్చి 9: మహాశివరాత్రిని పురస్కరించుకుని స్థానిక మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవరోజు శనివారం బ్రహ్మారథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ ఆవరణలోని కల్యాణమండపంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఆలయంలో ఉదయం రథాంగహోమం, రథాంగబలి నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా మడుగుతేరు లాగారు. గర్భగుడిలోని కాశీవిశ్వేశ్వరుని మూలవిరాట్‌కు వివిధరకాల పుష్పాలంకరణలు, ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన బ్రహ్మరథంలో శివపార్వతుల ఉత్సవమూర్తులను ఆసీనులు గావించి పురవీధుల్లో రథాన్ని లాగారు. రథోత్సవం ముందు భక్తులు భజనలు చేస్తూ ముందుకు సాగారు. ఆలయ ఆవరణలోని వేదికపై చిన్నారులు సంప్రదాయ నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యులు కల్పన, రాజేశ్వరి, వెంకటస్వామి, సురేష్‌బాబు, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, డి.సుబ్రహ్మణ్యం, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.


సంప్రదాయ నృత్యాలతో అలరిస్తున్న చిన్నారులు

మైనార్టీలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోం

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 9: ముస్లిం, మైనార్టీలకు కల్లబొల్లి మాటలు చెప్పి మోసం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ప్రజా, కులసంఘాల నాయకులుహెచ్చరించారు. ముస్లిం, మైనార్టీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ అనంతపురం అర్బన్‌లో 70 వేల మంది ముస్లిం, మైనార్టీలు ఉన్నారన్నారు. వారి సమస్యలపై మాట్లాడేందుకు ఏ ఒక్క ప్రజాప్రతినిధి లేక వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. అత్యధిక జనాభా ఉన్నామని ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలకు తెలిసినా రాజకీయంగా అవకాశం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి అనంత జిల్లా నుంచి రెండు ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీటు కేటాయించాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇదే అంశంపై ఆదివారం ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఇమామ్‌లు, ముతవల్లిలతో భవిష్యత్ కార్యాచరణపై సమావేశం నిర్వహిస్తామన్నారు. ఐఎంఎం వ్యవస్థాపక అధ్యక్షుడు మహబూబ్ బాషా, ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, దాసిగాని కుళ్లాయప్ప, గోగుల మూర్తి, షబ్బీర్, జాకీర్, షేక్షావలి, ముక్తియార్, షౌకత్‌ఖాన్ జాంగిర్ నజీర్, బాషా, షేక్షావలి పాల్గొన్నారు.



తలకిందులుగా నిరసన వ్యక్తం చేస్తున్న మైనార్టీ జేఏసీ నాయకులు

మహిళలకు ఫిట్‌నెస్ రన్


ఫిట్‌నెస్ రన్‌లో పాల్గొన్న మహిళలు

శింగనమల, మార్చి 9: మండలంలోని లోలూరు గ్రామంలో మహిళలకు నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని లోలూరు గ్రామంలో శనివారం మహిళ దినోత్సవం సందర్భంగా నారీశక్తి రన్‌ను యువ కేంద్రం, ఎస్సార్ ఎడ్యుకేషన్ కలసి ఫిట్నెస్ రన్ నిర్వహించాయి. గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఎస్సార్ ఎడ్యుకేషన్ కార్యదర్శి శివ, మల్లికార్జున, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, రవి పాల్గొన్నారు.

నేడు ఉరవకొండలో శంఖారావం సభ

ఉరవకొండ, మార్చి 9: పట్టణ శివారులోని అనంతపురం-బళ్లారి రహదారి పక్కన ఆదివారం నిర్వహించనున్న శంఖారావం సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఉదయం 9:30కు హాజరవుతారన్నారు. బహిరంగ సభకు వచ్చే కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ నాయకులకు సూచించారు. నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు, బూత్‌కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

వైసీపీ ఫ్లెక్సీల చించివేతతో కలకలం

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 9: అధికార పార్టీలో ఫ్లెక్సీల చించివేత శనివారం కలకలం రేపింది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కార్యకర్తలు, నాయకులతో విస్తృత స్థాయి సమావేశం మా ర్కెట్ యార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారమే పట్టణంలో ఫ్లెక్సీలు వెలిశాయి. వైసీపీ రాష్ట్ర నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి ఫ్లెక్సీలను ఆయన అనుచరులు ఏర్పాటు చేశారు. మార్కెట్ యార్డు సమీపంలో కొన్ని ఫ్లెక్సీలు, బైపాస్‌లోని నాగల కట్ట వద్ద కొన్ని ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వీటిని శుక్రవారం రాత్రి ఓ వర్గం వారు చించి వేశారు. ఇది ఆపార్టీలో ఉన్న లుకలుకలను బహిర్గతం చేసింది.


చించివేసిన ఫ్లెక్సీ

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ వివాహిత మృతి

బత్తలపల్లి, మార్చి 9: మండల పరిధిలోని డి.చెర్లోపల్లి వద్ద శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని శైలజ(29) అనే మహిళ ప్రాణాలు కోల్పోయారు. చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దల గ్రామానికి చెందిన మారుతి, తన భార్య శైలజతో కలసి శనివారం ముదిగుబ్బ మండలంలో జరిగే వీరనారాయణస్వామి పరుషకు బైక్‌పై బయలుదేరారు. డి.చెర్లోపల్లి వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన మరో బైక్‌పై వచ్చిన వ్యక్తి వీరి వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో మారుతి, శైలజ కింద పడి గాయపడ్డారు. స్థానికులు వారిద్దరినీ 108లో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. శైలజను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మారుతికి స్వల్ప గాయాలు కావడంతో చికిత్స చేసి వైద్యులు ఇంటికి పంపారు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసున మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


శైలజ (ఫైల్)

గోతిలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుత్తి, మార్చి 9: పట్టణంలోని గుత్తిఆర్ఎస్‌లో ముస్లిం శ్మశాన వాటి క సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు గోతిలో పడి శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు రెండు రోజులుగా రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేశాడన్నారు. మృతుడి వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహంపై పంచె, షర్ట్ ఉన్నాయన్నారు. మృతుడు ఏ ప్రాంతానికి చెందిన వాడో తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జితేంద్ర గౌడుతో భేటీ

గుంతకల్లు, మార్చి9: మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి శనివారం మధ్యాహ్నం గుంతకల్లులో మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడుతో భేటీ అయ్యారు. ప్రభాకర్ చౌదరి విజయవాడ నుంచి తిరిగి వెళ్తూ పట్టణంలోని జితేంద్రగౌడు క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జితేంద్రగౌడుతో తనకు అత్యంత సాన్నిహిత్యం ఉందని, ఆయనతో కుటుంబ, రాజకీయ అంశాలపై ఏకాంతంగా మాట్లాడానని తెలిపారు. అనంతపురం, గుంతకల్లు టిక్కెట్ల విషయంగా ఆయన్ను ప్రశ్నించగా సూటిగా సమాధానం ఇవ్వలేదు. క్యాంపు కార్యాలయం నుంచి జితేంద్రగౌడు స్వగృహానికి వయలుదేరి వెళ్లారు.

జనసేన సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్


జనసేన ప్రచార వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న టీసీ వరుణ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 9: జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ప్రచార వాహనాల ముఖ్య ఉద్దేశ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ అన్నారు. ఈ మేరకు శనివారం కొట్టేవారి విజయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిని ప్రచార వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని పలు సర్కిళ్లు, డివిజన్లలో ర్యాలీ నిర్వహించారు. వరుణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రచార వాహనాలు విస్తృతంగా పర్యటిస్తాయన్నారు. అందులో భాగంగా జనసేన పార్టీకి ఎంతో పట్టున్న అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వాహనాలు ప్రవేశించాయన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ఇవి పర్యటిస్తాయన్నారు. నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శులు పత్తి చంద్రశేఖర్, కుమ్మర నాగేంద్ర, కార్యదర్శులు రాపా ధనుంజయ, కిరణ్‌కుమార్, జయమ్మ, అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, హుస్సేన్, నగర కార్యదర్శులు లాల్ స్వామి, రాజేష్ కన్నా, కుమ్మర మురళీ, నాగార్జున, సంపత్, వల్లంశెట్టి వెంకటరమణ, ఆకుల అశోక్, నెట్టిగంటి హరీష్, మంగళ కృష్ణ పాల్గొన్నారు.

వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయ్


మహిళలతో సమస్యలు తెలుసుకుంటున్న పెండ్యాల శ్రీలత

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి9: వైసీపీ ప్రభుత్వ అవినీతి, అక్రమ పాలన అంతమయ్యేందుకు రోజులు దగ్గరపడ్డాయని జనసేన పార్టీ రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మండిపడ్డారు. ఆమె మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా శనివారం 42వ డివిజన్‌లో పర్యటించారు. మహిళలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ జగన్ పాలనతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంవైపు నడిపించే బాధ్యత బీజేపీ సహకారంతో జనసేన, టీడీపీలు తీసుకుంటాయన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టీడీపీలకు ఓటేసి వైసీపీని ఇంటికి సాగనంపాలన్నారు. అనంతరం కాలనీవాసులకు ఉమ్మడి మేనిఫేస్టోలోని అంశాలను వివరించారు. నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె, మార్చి 9: స్థానిక కస్తూర్బా విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశంతో పాటు 7, 8, 9 తరగతులలో మిగిలిన సీట్ల భర్తీ కోసం 12 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్ఓ నాగసత్య తెలిపారు. బడిమానేసిన పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థినులకు ఫోన్‌ద్వారా మెసేజ్ అందుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9966830119 నెంబరును సంప్రదించాలన్నారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

చెన్నేకొత్తపల్లి, మార్చి 9: మండల కేంద్రానికి సమీపంలోని కోన కణ్వాశ్రమంలో రెండు రోజుల పాటు నిర్వహించిన శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. మల్లికార్జున స్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం దేవాంగ సంఘం వారిచే అన్నదానం చేశారు. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

గార్లదిన్నె, మార్చి 9: మండలంలోని పెనకచెర్ల గ్రామంలో శుక్రవారం బావ, బామ్మర్దుల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో బామ్మర్ది బోతుల వేణుపై బావ కల్లుమడి ఎర్రిస్వామి ఓ పాఠశాల బస్సు డ్రైవర్‌తో హత్యకు యత్నించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నిందితుడు ఎర్రిస్వామిని శనివారం అనంతపురం పట్టణంలోని తపోవనం సర్కిల్‌లో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇల్లూరులో ఘర్షణ... ఒకరి పరిస్థితి విషమం

గార్లదిన్నె, మార్చి 9: మండలంలోని ఇల్లూరు గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి ప్రతాప్, శ్రీకాంత్‌ల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు ప్రతాప్, శ్రీకాంత్ అనే ఇద్దరు మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని చెన్నకేశవ ఆలయం వద్ద శుక్రవారం అర్ధరాత్రి గొడవకు దిగారు. గొడవలో శ్రీకాంత్ తలపై ప్రతాప్ క ట్టెతో దాడి చేశాడు. దాడిలో శ్రీకాంత్ తీవ్రం గా గాయపడ్డాడు. అతనిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రతాప్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.21వేలు

అనంతపురంరూరల్, మార్చి 9: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.21వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 229 టన్నులు చీనీకాయలు వచ్చాయన్నారు.

నేడు ఉచిత నాటక ప్రదర్శన

అనంతపురం కల్చరల్, మార్చి 9: లలితకళాపరిషత్ మాజీ ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి జయంతిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం 6 గంటలకు అరణ్యరోదన ఉచిత నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి పద్మజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కళాకారులు, కళాభిమానులు విరివిగా హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వైసీపీ నాయకుడు మెట్టుకు ఎదురు దెబ్బ

స్వగ్రామం ఉంతకల్లులో భారీగా టీడీపీలో చేరికలు


టీడీపీలో చేరిన ఉంతకల్లు వైసీపీ కార్యకర్తలు

రాయదుర్గం, మార్చి 9: వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి స్వగ్రామమైన శనివారం బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు గ్రామం నుంచి పెద్ద ఎత్తున ఆపార్టీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. 100 కుటుంబాల దాకా పార్టీలో చేరాయి. వారికి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. ఉంతకల్లు గ్రామానికి చెందిన కావలి విరూపాక్షి, ఓబుళేశు, సోమశేఖర, వన్నూరుస్వామి, శివప్ప, గోపాల్, హరిజన పంప, జక్కానప్ప, హనుమంతప్ప, శేఖర్, దేవేంద్రలతో పాటు పలువురు వైసీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున టీడీపీలోకి చేరారు. ఎంసీఏ కళాశాల ఆవరణలో కొందరిని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తన నివాసంలో మరికొందరిని పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. బొమ్మనహాళ్, కురవళ్లి గ్రామాల నుంచి కూడా పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ మంజునాథ, టీడీపీ మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చంద్రహాస్, ముల్లంగి నారాయణస్వామి, ముల్లంగి భాస్కర్, ఎస్కే మల్లికార్జున, మలెన్న, దిలీప్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

● రాయదుర్గం మండలంలోని బొమ్మక్కపల్లి గ్రామానికి చెందిన 29 కుటుంబాలు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. వైసీపీకి చెందిన వెంకటేశులు, గోపి, చాకలి ఎర్రిస్వామి, పీడీ ఎర్రిస్వామి, శివయ్యలతో పాటు మిగిలిన వారికి కూడా మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తన నివాసంలో పార్టీ కండువాలు వేసి స్వాగతించారు.

టీడీపీకి అనుకూలంగా ముస్లింలు


ప్రచారం చేస్తున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, మార్చి 9: ముస్లిం మైనార్టీలు తెలుగుదేశం పార్టీకి సానుకూలంగా ఉన్నారని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు. శనివారం పట్టణంలోని 27వ వార్డులో ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాలనే ఉత్సాహం మైనార్టీల్లో కనిపిస్తోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చి మోసం చేశాడన్నారు. మసీదుల మరమ్మతులు, షాదీఖానాల నిర్మాణాలు లాంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను టీడీపీ పాలనలో చేపట్టామన్నారు. జగన్ అధికారం లోకి వచ్చిన తరువాత మైనార్టీల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాడన్నారు. మైనార్టీల ఆదరణతో రాయదుర్గం నియోజకవర్గం నుంచి తాను 50 వేల మెజార్టీతో గెలవబోతున్నట్లు ధీమా వ్యక్తం చేశారు.

గోతిలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుత్తి, మార్చి 9: పట్టణంలోని గుత్తిఆర్ఎస్‌లో ముస్లిం శ్మశాన వాటిక సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు గోతిలో పడి శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు రెండు రోజులుగా రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేశాడన్నారు. మృతుడి వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహంపై పంచె, షర్ట్ ఉన్నాయన్నారు. మృతుడు ఏ ప్రాంతానికి చెందిన వాడో తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీలోకి పలువురు చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

కూడేరు, మార్చి 9: మండలంలోని ఎంఎంహళ్లి గ్రామంలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన సాకే నాగన్న, సాకే రమేష్, కోడిపల్లి ఆంజనేయులు, రమేష్, నల్లబోతుల పెన్నోబిళం, సాకేరమేష్, సాకమ్మ, కామక్క, వెంకటేష్, లింగమ్మ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సమక్షంలో టీడీపీలో చేరారు.

లోకేశ్ శంఖారావానికి తరలిరండి: కాలవ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, మార్చి 9: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావాలని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఆయన కణేకల్లు రోడ్డులోని రాయల్ ఎంసీఏ కాలేజ్ వద్ద ఏర్పాట్లను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు నిర్వహించే కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. రాయదుర్గం పట్టణానికి తొలిసారిగా లోకేశ్ విచ్చేస్తున్న సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, ఎన్‌టీఆర్, బాలకృష్ణ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాయదుర్గంరూరల్: పట్టణంలోని రాయల్ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించే శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాయదుర్గం మండల టీడీపీ కన్వీనర్ హనుమంతు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

కణేకల్లు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొనబోతున్న టీడీపీ శంఖారావం సభను విజయవంతం చేయా లని మండల కన్వీనర్ లాలెప్ప, క్లస్టర్ కన్వీనర్ ఆనంద్‌రాజ్ కోరారు. ఆదివారం మధ్యాహ్నం రాయదుర్గంలో జరిగే శంఖారావానికి మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

బొమ్మనహాళ్: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదివారం రాయదుర్గంలోని రాయల్ కాలేజీలో నిర్వహించే శంఖారావం సభను జయప్రదం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ బలరాం రెడ్డి కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బీఎల్‌ఓలు భారీగా తరలిరావాలన్నారు.

నారా లోకేశ్ పర్యటనను విజయవంతం చేద్దాం



కళ్యాణదుర్గంరూరల్, మార్చి 9: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదివారం కళ్యాణదుర్గం పర్యటనను విజయవంతం చేద్దామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఉమానగర్‌లోని తన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా లోకేశ్ శంఖారావం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా సభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కళ్యాణదుర్గంలో కూడా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గరుడాపురం రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు ఏకతాటి పైకి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీ గెలుపుతోనే అభివృద్ధికి బాటలు: జేసీపీఆర్


పూలతో జేసీపీఆర్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

తాడిపత్రిటౌన్, మార్చి9: టీడీపీ గెలుపే అభివృద్ధికి బాటలు వేస్తుందని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన చేపట్టిన యువచైతన్య బస్సు యాత్ర శనివారం కూడా కొనసాగింది. మండలంలోని చుక్కలూరు, పులిప్రొద్దుటూరు, గంగాదేవిపల్లి, జోగినాయునిపల్లి, బందార్లపల్లి, సీతారాంపురం, ఇగుడూరు గ్రామాల్లో ఆయన బస్సుయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ప్రతి గ్రామంలో మహిళలు పెద్దఎత్తున జేసీపీఆర్‌కు హారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రతి ఒక్కరిని పేరుపేరునా పలకరిస్తూ వారి యోగక్షేమాలను జేసీపీఆర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీపీఆర్ మాట్లాడుతూ టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. మేనిఫెస్టోలోని పథకాలను అధికారంలోకి రాగానే అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ, మండల కన్వీనర్ నరేంద్రనాయుడు, చల్లా సూరి, సోమశేఖర్‌నాయుడు, ప్రసాద్, పవన్‌కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

జితేంద్ర గౌడుతో మాజీ ఎమ్మెల్యే భేటీ

గుంతకల్లు, మార్చి9: మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి శనివారం మధ్యాహ్నం గుంతకల్లులో మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడుతో భేటీ అయ్యారు. ప్రభాకర్ చౌదరి విజయవాడ నుంచి తిరిగి వెళ్తూ పట్టణంలోని జితేంద్రగౌడు క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జితేంద్రగౌడుతో తనకు అత్యంత సాన్నిహిత్యం ఉందని, ఆయనతో కుటుంబ, రాజకీయ అంశాలపై ఏకాంతంగా మాట్లాడానని తెలిపారు. అనంతపురం, గుంతకల్లు టిక్కెట్ల విషయంగా ఆయన్ను ప్రశ్నించగా సూటిగా సమాధానం ఇవ్వలేదు. క్యాంపు కార్యాలయం నుంచి జితేంద్రగౌడు స్వగృహానికి వయలుదేరి వెళ్లారు.

ఊరూరా టీడీపీ భవిష్యత్తు గ్యారెంటీ

తాడిపత్రిటౌన్, మార్చి9: పట్టణంలోని 2, 3, 4వార్డుల పరిధిలోని ఏటిగడ్డపాలెం, మెయిన్‌బజారులో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అస్మిత్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని అంశాలను మహిళలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు విజయ్ కుమార్, రహీం, మల్లికార్జున, తలారి అరుణ, రమాదేవి, రేష్మాపర్వీన్, జింకా లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

యాడికి: టీడీపీని గెలిపించుకుందాం. ఊరును బాగు చేసుకుందామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ జేసీ అస్మిత్‌రెడ్డి తెలిపారు. శనివారం యాడికిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సమస్యలపై స్థానికులను ఆరాతీశాడు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు చవ్వా గోపాల్‌రెడ్డి, తిరంపురం నీలకంఠ, ఆదినారాయణ, రూపునేని రాజశేఖర్, మనోహర్ చౌదరి, తాంద్ర విక్రమ్, గన్నె రమేష్, బొట్టు శేఖర్, మధురాజు, సుభాన్, విజయ్, నారాయణస్వామి, కృష్ణమూర్తిచౌదరి, రామచంద్రారెడ్డి, త్రినాథ్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, చాంద్‌బాషా పాల్గొన్నారు.


యాడికిలో సమస్యలపై ఆరాతీస్తున్న జేసీ అస్మిత్‌రెడ్డి

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

యాడికిలోని ఆంజనేయస్వామికాలనీకి చెందిన మాజీ వార్డు మెంబరు రమణ, మద్దిలేటి, జనార్థన, రంగనాథ్‌రెడ్డి, గోవింద్‌లతో పాటు 10కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. జేసీ అస్మిత్‌రెడ్డి టీడీపీ కండువాలు వేసి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు, క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉరవకొండలో శంఖారావం సభ


బహిరంగ సభకు ఏర్పాట్లు

ఉరవకొండ, మార్చి 9: పట్టణ శివారులోని అనంతపురం-బళ్లారి రహదారి పక్కన ఆదివారం నిర్వహించనున్న శంఖారావం సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఉదయం 9.30కు హాజరవుతారన్నారు. బహిరంగ సభకు వచ్చే కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ నాయకులకు సూచించారు. నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు, బూత్‌కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

గుంతకల్లుకు 'గుమ్మనూరు' వద్దు


నిరసన తెలుపుతున్న ముస్లిం మైనార్టీలు

గుంతకల్లు, మార్చి9: టీడీపీ తరపున అసెంబ్లీ టిక్కెట్టును మాజీమంత్రి గుమ్మనూరు జయరాంకు కేటాయించరాదని ఆ పార్టీ ముస్లిం మైనారిటీలు నిరసన వ్యక్తం చేశారు. శనివారం ఉదయం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సమావేశ మైన ముస్లింలు మాట్లాడుతూ పక్క జిల్లా నుంచి జయరాంను గుంతకల్లుకు తీసుకు రావాలసిన అవసరం ఏముందని ప్రశ్నించారు. పార్టీలో చేర్చుకోండి కానీ అతడికి టిక్కెట్టును కేటాయించరాదని అధిష్టానాన్ని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కే మహమ్మద్ రఫి, ఆటో ఖాజా, ఫ్రూట్ మస్తాన్, ఫజులు, ఇస్మాయిల్, ఖలీల్, సాదిక్ వలి, అతిక్ అహ్మద్, డీ బాబు, జీ అబ్దుల్లా, జిలాన్, నిజాం, బిల్వా మస్తాన్, మహమ్మద్, ఖాజా మోదిన్, ఇలియాజ్, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన గుంతకల్లు నియోజకవర్గానికి గుమ్మనూరు జయరాం వద్దని టీడీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడే నిరసన చేపట్టి విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రామాంజనేయులునాయక్, జిల్లా అధ్యక్షులు రమేష్‌నాయక్, జిల్లా కార్యదర్శి రాజేష్‌నాయక్, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు రవి, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ మల్లికార్జుననాయక్, గురుస్వామినాయక్, దివాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.


పామిడిలో నిరసన తెలియజేస్తున్న టీడీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు

జీడిపల్లి రిజర్వాయరుకు 603 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, మార్చి 9: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 603 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 400 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శనివారం తెలిపారు. రిజర్వాయరులో 0.451 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

వైసీపీ ఫ్లెక్సీల చించివేతతో కలకలం


చించివేసిన ఫ్లెక్సీలు

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 9: అధికార పార్టీలో ఫ్లెక్సీల చించివేత శనివారం కలకలం రేపింది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కార్యకర్తలు, నాయకులతో విస్తృత స్థాయి సమావేశం మార్కెట్ యార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారమే పట్టణంలో ఫ్లెక్సీలు వెలిశాయి. వైసీపీ రాష్ట్ర నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి ఫ్లెక్సీలను ఆయన అనుచరులు ఏర్పాటు చేశారు. మార్కెట్ యార్డు సమీపంలో కొన్ని ఫ్లెక్సీలు, బైపాస్‌లోని నాగల కట్ట వద్ద కొన్ని ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వీటిని శుక్రవారం రాత్రి ఓ వర్గం వారు చించి వేశారు. ఇది ఆపార్టీలో ఉన్న లుకలుకలను బహిర్గతం చేసింది.